ఆశిస్ నంది

# ప్రియ శత్రువు

తెలుగు సేత : డి.వెంకట్ రావు

ఎమెస్కో

# విషయ సూచిక


| | |
|---|---|
| ఎందుకంటే | 5 |
| సంపాదకీయం | 6 |
| తెలుగు ప్రతికి ముందుమాట | 10 |
| వలసతత్త్వ విచారణ | 13 |
| ముందుమాట | 47 |
| 1. వలసపాలక మనస్తత్త్వం | 59 |
| 2. వలసతత్త్వ రహిత మనఃస్థితి | 113 |
| ఇరవై ఐదేళ్ళ తరువాత ప్రియ శత్రువు : మలిమాట | 185 |
| ఋణాలు – అనుబంధాలు | 199 |

# వలస మేధలు

తెలుగులో స్వతంత్ర తాత్విక సంప్రదాయం అనేదేదీ లేదు. ఏదైనా వుంటే సంస్కృత, బౌద్ధ సంప్రదాయ దర్శనాల పైనగానీ లేదా అప్రయాసతో అందిన అనాలోచిత, మూఢ "నవ్య" సిద్ధాంతాలపైన గానీ ఆధారపడిన తాత్త్వికాలు మాత్రమే వున్నాయి తెలుగులో. ఒక శతాబ్దం పైగా ప్రబలిన ఈ నయా రేచీకటిలో స్వైరం చేస్తూంది మన తెలుగు "తత్త్వ చితి – చింతన." "తత్త్వ విద్యార్థులున్నారు కాని, వారిదంతయు పుస్తక పాఠము. వారి శక్తి యంతయు ఇతరులు చెప్పినదానిని వల్లించుటలో ముగిసినది"[1] అన్నారు రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు తమ వేమన పుస్తకంలోని మొదటి పేరాలో.

ఎనభై ఏళ్ళక్రితం పరతంత్ర మేధా పరిజ్ఞానం ప్రబలిపోతున్న కాలంలో, మనకై మనవైన మన తత్త్వ సంప్రదాయాలు ఎందుకులేవా అని ప్రిన్స్‌లీ కన్నడ దేశం నుండి ఆరా తీస్తారు రాళ్ళపల్లి. ఆంధ్రుల వైచిత్ర్యాన్ని గురించి విచారిస్తారు తమ వేమన పుస్తకంలో. అన్నింటికంటె విచిత్రమైన విషయం ఆయన తెలుసుకొన్నదేంటంటే "సుప్రసిద్ధ మతస్థాపకులెవరును ఆంధ్రులై పుట్టి ఆంధ్రదేశమున మతబోధ చేయకపోవుట."[2] మతస్థాపన, బలవంతంగానైనా మతాన్ని బోధించడం అనేవి బుద్ధుడితో మొదలయ్యాయని సూచిస్తారు రాళ్ళపల్లి. శంకరుడి ద్వారా ఈ పద్ధతులు (వాగ్వివాదాలతో, మత నిరూపణ – ఖండనలతో) కొనసాగి ఆచార్యుల్ని, మతాచారాల్ని "భరతఖండం"లో శతాబ్దాలుగా విస్తరింపచేసాయి అంటారు రాళ్ళపల్లి. వారిని పజిల్ చేసిన ఆంధ్రవైచిత్ర్యం ఏంటంటే ఆంధ్రదేశం ఇలాంటి తాత్త్వికాలకూ–మతాలకూ దేనికీ స్థావరం కాకపోవటం. "తెలుగు వారికి తీవ్రములగు తత్త్వములను విచారించుటకు గావలసిన మేధాశక్తి లేదని చెప్పుట సాహసము. వారికి తత్త్వ విచారములందు రుచిలేదని యూహించుట యన్యాయమగును", అని రీజనింగ్ చేస్తారు రాళ్ళపల్లి. అయినా మతం అనేది ఆచార వ్యవహారాలు, భాషావేశాల బంధనాలుగా గుర్తిస్తూ, "ఆంధ్రజాతి" యొక్క వైశిష్ట్యాన్ని వారు పరిహసన వ్యంగ్యంలో అభివ్యక్తం చేస్తారు. "సహజముగా స్వాతంత్ర్యరక్తియు, స్వాభిమానమును బలమునూఁ గల యాంధ్రజాతిని గొఱ్ఱెల మందలవలె నొక మతపుదొడ్డిలోఁ దోలుట కే తత్త్వజ్ఞానికిని సాధ్యముగాక పోయెనేమో!"[3]

ఆంధ్రుల స్వాభిమానబలం మాట అటుంచి, రాళ్ళపల్లి తత్త్వస్వాతంత్ర్యాల గురించి విచారించే రీతిని జాగ్రత్తగా గమనిస్తే పరతంత్ర తాత్త్వికాలు మనకు తెలియకుండానే మన ఆలోచనల్ని నడిపిస్తాయేమో అనేది విశదమౌతుంది. రాళ్ళపల్లిగారి వేమన పుస్తకంలోని మొదటి

మూడు పేజీల్లోనే జాతి, మతము అనే పదాలకు మౌలికంగా వుండే అర్థాలు మారిపోతాయి. జాతి అనే పదానికి తెగ, రీతి, కులము, వస్తుధర్మము, జన పద సముదాయాలు ఇంకా వేరెన్నో భాషా సంస్కృతులకు సంబంధించిన వ్యవహారాలు; మరి అలాగే మతం అనే పదానికి అభిప్రాయము, సమ్మతము, జాతి, శాస్త్రము, విశిష్ట ఆలోచనారీతి ప్రతిపాదనా సత్త్వము, భాషా వ్యవహారాల ఆచారాల ప్రత్యేకతలని సూచించే తత్త్వ దృక్పథం, పరంపరల కొనసాగింపులలో మార్పులను ప్రకాశింపచేసే ప్రజ్ఞ అనే అర్థాలు తెలుగు పరిభాషా సంస్కృతిలో భాగాలే. అయితే ఈ అర్థాలు మారిపోయి ఈ అర్థాలని అధిగమించిన ఏకీకృతమైన ఓ "జాతీయత" అనే అస్తిత్వరూపంగానూ, మరి ఈ రూపాన్ని ఒక నిర్దిష్టమైన భరతఖండం, ఆంధ్రదేశం లాంటి భూభాగానికి సంకేత సారంగానూ పొందుపరుస్తూ నడుస్తుంది రాళ్ళపల్లివారి చింతన ఇక్కడ.

లెక్కలేనన్ని విశిష్ట సంప్రదాయాలుగా, అంతుచిక్కని భిన్నజాతులుగా విస్తరిల్లిన ఈ దేశ ప్రక్రియల్లో ఎప్పుడైనా గతంలో ఇలాంటి రూపసారాల, దేశ జాతీయతల సముచ్చయం జరిగిందా? ఒకవేళ అలాంటి (దేశ-మత-జాతి-తత్త్వ) ఏకత్వం జరగని పక్షంలో అది ఎందుకు ఇంతకు పూర్వం జరగలేదు? ఈ ప్రశ్నలకు రాళ్ళపల్లి వారి చింతనలో తావులేదు. ఇక్కడ కేవలం మారుతున్న పదాల అర్థాల గురించి కాదు ప్రస్తావన. ఈ మార్పుకి మౌలికంగా తాత్త్విక యోచనాలోతుల్లోంచి జరుగుతున్న స్థానభ్రంశాల గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది.

జాతులు, మతాలు విశిష్ట వైవిధ్యాల చిహ్నాలు, మార్గాలు. శాఖాను శాఖలుగా విస్తరిల్లిన (వేద) ప్రక్రియా సంప్రదాయాల వైవిధ్యాల్ని గమనిస్తూ.

> భేదానాం బహుమార్గత్వం...
> తస్య శాఖాసు దృశ్యతే [4]

అంటాడు భర్తృహరి వాక్యపదీయంలో. ఈ నిశిత విశిష్టతల్ని దూరం చేస్తూ, జాతి మతాల్ని ఏకీకృతం చేస్తూ వాటిని ఒక నిర్దిష్ట భౌతిక దేశ జాతీయతా సారంగా పటిష్ఠం చేస్తూ - విశిష్టతలకీ దేశ జాతీయతకీ మధ్య ఓ అగాథాన్ని నిలిపింది వలసవాదం. ఈ తాత్త్విక (రాజకీయ) అగాథాన్ని దాటడం ఒక జాతీయతా తత్త్వం ద్వారానే సాధ్యం అనే దృక్పథాన్ని స్థిరపరచింది వలసపాలన. "పాశ్చాత్యజాతి", "హిందూమతము" (రాళ్ళపల్లి వారి వ్యాసంలోని పదాలు) అనే ప్రతిబింబ సిద్ధాంతాల్ని బలపరిచింది వలసతత్త్వం.

గత శతాబ్దం పైగా ఆంధ్రమేధా స్రవంతి ఈ వలసవాద ప్రేరేపిత ఆలోచనా రీతుల్నించి దృష్టి మరల్చలేకపోయింది. తను నడిచే ఉపరితల జాతీయత అనే దొడ్డి క్రిందున్న తాత్త్విక అగాథం వైపు ఆలోచనల్ని (ప్రక్రియల్ని) మలచలేకపోయింది "ఆంధ్రుల సంస్కృతి". జాతుల విశిష్టతలు సూచించే ప్రక్రియా పరంపరలకీ మత వైవిధ్యాలు చూపే పరంపరలకీ మార్పులకీ, దేశీయత, జాతీయత, హైందవ "మత" పంథాలకీ మధ్యనున్న మౌలిక భేదవ్యత్యాసాల్ని గురించి

ఆలోచింపచేసే మార్గాల్ని నిర్భయంగా తొలవలేకపోయింది ఈ "ఆంధ్రజాతి". ఒక్క మాటలో చెప్పాలంటే గత శతాబ్దం పైగా వలసవాదం గురించి, వలసతత్త్వం చూపిన త్రోవలో కాకుండా మరోలా ఆలోచించే మార్గాన్ని ఆంధ్రమేధా సాంస్కృతిక చరిత్ర సూచించలేకపోయింది. వలస ప్రజ్ఞ గీసిన జాతీయతా, దేశీయతా భావాల్ని, వాటిని పటిష్ఠం చెయ్యడానికి "చారిత్రిక పరిశోధన" అనే గీతదాటి సాగిన ఆలోచనలు చాలా అరుదు ఈ "ఆంధ్రుల చరిత్ర"లో అనే చెప్పాలి.

రాళ్ళపల్లికి ఒక దశాబ్దానికి పూర్వమే గురజాడ తన ద్రష్ట దొరల ప్రశస్తిలో వారి విజ్ఞాన సేకరణ పద్ధతి గురించి, అది చేకూర్చే సత్యవిద్యల గురించి పొగడిన విషయం తెలుగువారికి సుపరిచయమే.

కన్నుగానని వస్తుతత్త్వము
కాంచనేర్పరు లింగిరీజులు
కల్లనొల్లరు; వారి విద్యల
కరచి సత్యము నరసితిన్.

జ్ఞానాన్ని స్వాతంత్ర్యాన్నిచ్చే ఈ ఆంగిలేయుల ధర్మరాజ్యంలో సకల వాంఛలూ తీరుతాయి అని తీర్పు చెప్పేస్తాడు గురజాడ. ఈ రాజ్యమిచ్చిన "విజ్ఞాన" మార్గంలోనే తన "సంస్కృతిని" హైందవంద్వారా జాతుల ఏకీకృతం చేస్తూ భగవద్గీతా మార్గాన్ని మధురవాణికందిస్తాడు. అలాగే నయావిద్యల "శాస్త్రీయ" చారిత్రక అన్వేషణల దక్కన్ కాలేజీ మార్గాన్ని బుచ్చమ్మకి చూపుతాడు. ఈ రెండూ, జాతుల విశిష్టతల్ని రూపుమాపే క్రైస్తవ సార్వజనీనపు ఆధునికతా ప్రతినిధి సౌజన్యారావుతో ముందుంచుతాడు గురజాడ (ఆధునికపు "సుజనుల కాంగిలేయుల ధర్మరాజ్యము").

ఆధునికపు "బంగారు కాలము" మన కాంగిలేయులు ఇచ్చిన మహా ప్రసాదంలా స్వీకరిస్తుంది తెలుగు మేధాచరిత. "ఆంధ్ర సంస్కృతి చరిత్రలో ఆధునిక శాస్త్రీయ దృష్టిని ప్రవేశపెట్టి 'రినేజన్స్' అనే నవ్య భావోత్తేజకానికి ప్రారంభకుడయ్యాడు" సి.పి. బ్రౌన్ అని ఉద్ఘాటించిన కె.వి.రమణారెడ్డి దృక్పథాన్ని తెలుగు మేధాచరితకి ప్రాతినిధ్య నిదర్శనంగా చూపొచ్చు. "వలసాధిపత్యాన్ని అటుంచి, అలాంటి (సి.పి.బ్రౌన్) మహనీయులకు సవిమర్శకంగా కృతజ్ఞత ప్రకటించటం సమంజసం."[5] "వలసాధిపత్యాన్ని అటుంచడం" అంటే ఏమిటో గోచరం కాదు కె.వి.ఆర్ వంటి నిశిత విమర్శకుని రచనలో. వలసాధిపత్యం కేవలం ఆర్థిక వనరుల లూటీయే కాదు కదా? ఆంధ్రుల భావోత్తేజకానికి బ్రౌన్ ఆరంభకుడయ్యాడంటే ఈ నవ్య "రినేజన్స్" లోతులు ఎంతో తెలుస్తాయి. వలస మేధా నియతుల పట్టు తెలుస్తుంది.

"ఆధునిక శాస్త్రీయ దృష్టి" గా వేరూనిన వైఖరి క్రైస్తవ సాంస్కృతిక లిఖిత వ్యాఖ్యాన సంప్రదాయాల్లో పెరిగి, అచ్చు సంస్కృతి ద్వారా వలస పాలనల ద్వారా ప్రబలంగా విస్తరిల్లిన, ఒక కోవకి చెందిన ఆలోచనా సంప్రదాయంగా గుర్తించిన వారు తెలుగులో rare. ఈ సంప్రదాయం